# మనస్తత్వాలు

శివరావు ఆ రోజు చాలా వుల్లాసంగా వున్నాడు !

కారణం మరేం లేదు. శివరావు ఆ రోజుతో తాలూకా హెడ్‌గుమాస్తా ఉద్యోగం నుంచి రిటైరవుతున్నాడు.

'రేపు' ని తలుచుకుంటూ సంతోషపడుతున్నాడు. రేపట్నుంచి ఆ వెధవ ఫైళ్ల మధ్య కూరుకుపోనక్కర్లేదు. అయిదుగంటలు ఎప్పుడవుతుందా అని నిముషాలు లెక్కపెట్టుకుంటూ గడపక్కర్లేదు. అయిదుగంటల తర్వాత డొక్కు సైకిలు ఈడ్చుకుంటూ, వుసూరుమంటూ ఇంటికి రానక్కర్లేదు.

రేపట్నుంచి తను పంజరం విడిచిన పక్షి. ఎప్పుడు నిద్రలేచినా ఫర్వాలేదు. తీరుబడిగా కూర్చుని భోజనం చేయొచ్చు. ఎక్కడ తిరిగినా, ఎప్పుడొచ్చినా అడిగేవారుండరు....

ఇలా అనుకుంటూ శివరావు ఆ రాత్రి చాలా హాయిగా నిద్రపోయాడు.

* * *

శివరావుకి ఇద్దరు కూతుళ్ళు, ముగ్గురు కొడుకులు. ఆడపిల్లలందరికీ పెళ్లిళ్లు చేశాడు. వాళ్ల పెళ్లిళ్లకు శివరావు పి.ఎఫ్. ఖర్చయిపోవడంతో పాటు, మార్వాడీ దగ్గర అప్పుకూడా చేయాల్సి వచ్చింది.

పెద్దకొడుకు చంద్రం బి.కామ్ ప్యాసయి ఒక ప్రైవేటు వుద్యోగం చేస్తున్నాడు. అతడికి క్రిందటి సంవత్సరమే వివాహమైంది.

మిగతా కొడుకులు ఇంకా చదువుకుంటున్నారు !

* * *

శివరావుకి మర్నాడు వుదయం మామూలుగా అయిదున్నరకే మెలకువ వచ్చింది! ఇవ్వాళ ఆఫీసు లేదు గదాని మళ్లీ పడుకోవాలనుకున్నాడు కానీ నిద్రపట్టలేదు. లేచి దొడ్లోకి వచ్చాడు.

అక్కడ బాదంచెట్టు క్రింద పనిపిల్ల అంట్లు వేసుకుని, బరబరా తోమేస్తోంది. శివరావు ఒక వేపపుల్ల విరుచుకుని నూతి గట్టుమీద కూర్చున్నాడు.

ఆకాశం నిర్మలంగా వుంది.

సూర్యుడు తూర్పుకొండ మీదికి మెల్లగా వస్తున్నాడు. పక్షులు చేసే కిలకిలా రవాలు సూర్యుడికి చెప్పే స్వాగత గీతికల్లా వున్నాయి.

ఎంత అద్భుతంగా వుందీ దృశ్యం !

ఉషోదయం ఇంత అద్భుతంగా వుంటుందని తన కింతవరకూ తెలీదు.

చల్లటిగాలి శరీరాన్ని సోకుతుంటే ఎంతో హాయిగా అన్పించింది. ఇన్నాళ్ళూ, తను ఎంత అనుభూతి కోల్పోయాడో ?...... అనుకున్నాడు శివరావు.

ఉదయిస్తున్న సూర్యుడిని చూస్తూ దంతధావనం కానిచ్చాడు.

ఆ తర్వాత గదిలోకి వచ్చాడు. కిటికీ క్రిందుగా పేపరు పడివుంటే తీసుకుని చదువుతూ కూర్చున్నాడు.

ఇంతలో కోడలు పద్మ కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది. అది త్రాగి దొడ్లోకెళ్లి స్నానం చేసి వచ్చాడు. అప్పటికి తొమ్మిది గంటలయింది.

పిల్లలు కాలేజీకి తయారవుతున్నారు !

"చంద్రం ! వడ్డించాను రారా !" శివరావు భార్య శాంత కొడుకుని భోజనానికి పిలుస్తోంది.

రోజూ ఆ సమయానికి భోజనం చెయ్యడం శివరావుకి అలవాటు. అందుకే తనుకూడా లేచి వంటింట్లోకెళ్లి పీటమీద కూర్చున్నాడు.

"అదేమిటండీ ! ఆ పీటమీద మీరు కూర్చున్నారు. మీరివ్వాళనుంచీ ఆఫీసుకు వెళ్లనక్కర్లేదన్నారుగా ! మీరు తర్వాత తిందురుగానీ ! లేవండి !" అంది భార్య.

ఆ మాటల్తో శివరావు మనస్సు చివుక్కుమంది. వేడి వేడి అన్నం తీరుబడిగా కూర్చుని తిందామని వచ్చాడు. చటుక్కున అక్కడనుంచి లేచి గదిలోకి వచ్చేశాడు.

భోజనాలు చేసి పెద్దకొడుకు ఆఫీసుకి, మిగతా వాళ్లు కాలేజీలకు వెళ్లిపోయారు.

పదకొండు ప్రాంతంలో శాంతమ్మ భర్తను భోజనానికి పిలిచింది. అప్పటికే శివరావుకి నీరసంతో ప్రాణం కడగట్టినట్లయింది. భార్య పిలవగానే గబగబా వెళ్లి కంచం ముందు కూర్చున్నాడు.

అన్నం చల్లారిపోయి మేకుల్లా వుంది. దాన్ని చూడగానే ఆకలి చచ్చిపోయింది. ఎలాగో తిన్నాననిపించి గదిలోనికి వచ్చి కూర్చున్నాడు. టైము గడవనట్లన్పించింది.

మధ్యాహ్నం పూట నిద్రపోవడం అతనికి అలవాటు లేదు. కాస్సేపు భార్యతో మాట్లాడుదామని -

"శాంతా!" అని పిలిచాడు.

పిలిచిన పదినిముషాలకు వచ్చింది ఆవిడ - "ఏమిటండీ !" అంటూ.

శివరావు భార్యవేపు చూశాడు. పమిటకొంగు నడుముకి బిగించింది. ముఖంమీద చిరుచెమట. ఒక చెయ్యి నడుంమీద పెట్టుకుని అలా అడుగుతుంటే శివరావుకి ఏం మాట్లాడాలో తోచలేదు.

"నీ భోజనం అయిందా ?" అనడిగాడు.

" ఆ ! ఇప్పుడే అయింది."

ఇంకేం అడగాలో శివరావుకి స్ఫురించలేదు.

"ఎందుకు పిలిచారు ?"

"కాస్సేపలా స్థిమితంగా కూర్చోకూడదూ !"

"ఇంకా నయంలెండి ! అవతల చచ్చేంత పని వుంది. మీరైతే రిటైరయ్యారు ! కానీ నన్నెవరూ రిటైరు చెయ్యలేదు," అంటూ లోపలికి వెళ్లి పోయింది.

శివరావు కొయ్యబారినట్లయ్యాడు.

తన భార్య శాంతేనా ఇలా మాట్లాడేది !

ఇదివరకు తను ఆఫీసునుంచి త్వరగా రావడం లేదని తనమీద కోపగించుకునేది. "ఇంటికొచ్చాక కూడా ఆ వెధవ పుస్తకాలు ముందేసుకుని కూర్చోకపోతే కాస్సేపు నాతో మాట్లాడకూడదూ !" అంటూ సతాయించేది.

మరివ్వాళ ఎందుకిలా అంటోంది ! కారణం తెలీక శివరావు స్తబ్ధుగా వుండిపోయాడు.

మూడు గంటలకు కాఫీ త్రాగి ముఖం కడుక్కుని అలా తిరిగొద్దామని బయటికొచ్చాడు.

నాలుగు రోడ్లు తిరిగి పార్కులోకి వచ్చి కూర్చున్నాడు. అక్కడ శివరావు స్నేహితుడు రంగనాథం కలిశాడు.

రంగనాథం హైస్కూలు టీచరు. అతడికింకా అయిదేళ్ల సర్వీసుంది.

మాటల మధ్య రంగనాథం అన్నాడు -

"శివరావ్ ! అదృష్టమంటే నీదోనోయ్ ?"

శివరావు ఏమిటన్నట్లు చూశాడు !

"హాయిగా రిటైరయ్యావు ! కొడుకు సంపాదనాపరుడయ్యాడు. ఇంతకంటె

ఇంకేం కావాలి ! మా అబ్బాయి ఇంకా ఇంటర్‌లోనే వున్నాడు. ఎప్పటికి చేతికంది వస్తాడో!'' అన్నాడు విచారంగా.

ఆ మాటలు శివరావుకి నవ్వు తెప్పించాయి. తను నిజంగా అంత అదృష్టవంతుడా'!''

రంగనాథం కాస్సేపు తన స్కూలు విషయాలు చెప్పాడు.

ఏడు గంటలవుతుండగా ఇద్దరూ లేచి ఇంటి దారి పట్టారు.

ఇంట్లోకి అడుగుపెడ్తున్న శివరావుని చూసి -

''ఏవండీ ! బయటికెళ్లేటప్పుడు కాస్త చెప్పి వెళ్లకూడదూ ! వచ్చేటప్పుడు ఏవైనా కూరలు తెచ్చేవారు గదా !'' అంది శాంతమ్మ.

''ఏం ? చిన్నబ్బాయి తేలేదా ?''

పిల్లలు ఎదిగాక శివరావు ఎప్పుడూ కూరలు తేలేదు.

''వాడికి కాలేజీ ! మీ రివ్వాళనుంచీ ఖాళీయే గదా !''

ఆ మాట శివరావు గుండెల్లో సూటిగా తాకింది. గబగబా గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

''మీ రివ్వాళనుంచీ ఖాళీయే గదా !'' భార్య అన్న ఆమాటే చెవిలో మారుమ్రోగుతోంది.

ఎంత తేలికగా అంది. తనప్పుడే అంత చులకనయిపోయాడా ?

భార్య భోజనానికి పిలిస్తే వెళ్లి భోజనం ముగించుకుని వచ్చాడు.

చంద్రం కూడా ఆయన వెనకాలే వచ్చాడు.

శివరావు చంద్రాన్ని చూస్తూ - ''ఏమిట్రా !'' అనడిగాడు.

చంద్రం కుర్చీలో కూర్చుంటూ -''నాన్నా ! మీకు ఈ నెల జీతం ఇచ్చారా ?'' అనడిగాడు.

''ఆ ! ఏం ?'' శివరావు వాలుకుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

''కొద్దిగా డబ్బు అవసరంగా వుంది నాన్నా !'' అన్నాడు చంద్రం.

'' నా జీతంలో సగం మార్వాడీ అప్పు క్రింద పోయిందిరా ! మిగిలింది నా చేతి ఖర్చులకు వుంచుకున్నాను. పెన్షన్ ఎప్పుడొస్తుందో గదా !''

ఆ మాటలు విన్న చంద్రం ముఖం నల్లబడింది.

''నాన్నా ! ఈ మార్వాడీ అప్పు ఇంకా ఎప్పటికీ తీరుతుంది ?''

''ఏమోరా ! నాకూ అదే బెంగగావుంది. అసలు సంగతి దేవుడెరుగు. నెలనెలా వడ్డీ కట్టలేక ఛస్తున్నాను !'' అన్నాడు భారంగా.

చంద్రం చివుక్కున లేచి నిలబడ్డాడు.

"అయినా అంతా నీదే తప్పు నాన్నా ! అళ్ళుళ్ళ కోసం ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టావ్ ! మా విషయం ఒక్క రోజైనా ఆలోచించావా ! ఇవ్వాళ నుంచీ రిటైరయ్యావు ! ఈ ఇంట్లో అందరూ కూర్చుని తినేవాళ్లే ! ఇటు మార్వడీ అప్పు ! అటు ఇంటి ఖర్చు ! ఇదంతా ఇక నా ఒక్కడి జీతంతో సర్దాలి ! ఏం చేస్తాం ! పెద్దలు చేసిన తప్పుకి పిల్లలు శిక్ష అనుభవించాలి !"

అని చరచరా బయటికెళ్లిపోయాడు. శివరావు, చంద్రం వెళ్ళినవేపే వెర్రిగా చూస్తూ వుండి పోయాడు.

ఇలా మాట్లాడింది తన చంద్రమేనా ! కనీసం తలెత్తి తనవేపు చూడటానికి భయపడే చంద్రమేనా !

వాడి మనస్సులో తనమీద ఇంత కోపం వుందన్నమాట !

ఆ రాత్రి శివరావుకి నిద్రపట్టలేదు !

ఉద్యోగ విరమణచేసి ఇంకా ఒక్కరోజు కాలేదు.

అప్పుడే ఇంట్లో అందరూ తన మీద ఎందుకింత అయిష్టం చూపుతున్నారు ?

తనింకా కొన్నాళ్లపాటు వుద్యోగం చేస్తే బాగుండేదేమో ! అనుకున్నాడు శివరావు బాధగా.

* * *

రోజులు గడుస్తున్నాయి.

రోజురోజుకీ ఇంటి పరిస్థితి మారిపోతుంది. ఇంట్లో పనిమనిషికున్న విలువకూడా శివరావుకి లేకుండాపోతుంది.

ప్రొద్దుటిపూట ఎనిమిదింటికి కాఫీ తెచ్చి ఇస్తోంది పద్మ.

ముఖం కడుక్కోగానే కాఫీ త్రాగాలని వుంటుంది శివరావుకి. పద్మ తెచ్చి ఇచ్చేవరకూ ఆగలేకుండా వున్నాడు.

"పద్మా ! ఇంత ఆలస్యం చేస్తున్నావేమమ్మా" అనడిగాడొక రోజు.

"అందరికీ ఒక్కసారే ఇవ్వడానికి నాకేం పదిచేతులు లేవు !" అంటూ వెళ్లిపోయింది.

అంటే .... తనకి కాఫీ అందరికంటే చివరికి ఇవ్వాలా ! ఇదివరకులా మొదటగా కాఫీ త్రాగే అర్హత పోయిందా ?

చిన్నగా నిట్టూరుస్తూ కాఫీ గ్లాసు నోటి దగ్గర పెట్టుకున్నాడు.

కాఫీ నీళ్లలా వుంది ! దానికితోడు చేదు ! రెండు గుక్కలు త్రాగి ఇక త్రాగలేక క్రింద పెట్టేశాడు.

ఒక్క కాఫీ విషయమే కాదు ! స్నానం చెయ్యడానికి వెడితే పిల్లలు -

"నాన్నా ! నీకేం తొందర లేదుగదా ! మేము వెళ్లాక స్నానం చెయ్యి ?" అంటూ వేడినీళ్లన్నీ పోసుకుని బాయిలర్ ఆర్పేశేవారు.

శివరావు చలివేస్తున్నా చన్నీళ్లే పోసుకోవాల్సి వచ్చేది.

ఇప్పుడు బజారుపని కూడా శివరావే చూస్తున్నాడు.

"ఏమిటండీ ! ఈ కూరలు తేవడం. అన్నీ పుచ్చులే ! మీకు ఒక్కపనీ చేతకాదు !" అని శాంతమ్మ సతాయించని రోజులేదు. ఇవన్నీ ఎలాగో భరిస్తున్నాడుగానీ - అన్నిటికంటె ముఖ్యం పదకొండు గంటల వరకూ భోజనానికి వుండాలంటే మాత్రం చాలా కష్టంగా వుంది.

తొమ్మిది దాటిన దగ్గర్నించి భోజనం కోసం ప్రాణం కొట్టుకుపోతుంది. భార్య ఎప్పుడు పిలుస్తుందా అని ఎదురుచూస్తూ కూర్చునేవాడు.

ఇక అన్నంలోకి ఒకరోజు కూర లేకపోతే, మరో రోజు పప్పు వుండేది కాదు.

ఏదైనా అంటే -" పిల్లలు వేసేసుకున్నారండీ" అనేది. రిటైరయ్యాక పెరుగు ఎలా వుంటుందో మర్చిపోయాడు.

భార్య ఏం పెడితే అది తిని వచ్చేవాడు. అన్నం కడుపునిండా తినకపోవడంతో మధ్యాహ్నం ఆకలయ్యేది.

ఇంట్లో టిఫిను చేసినా అతని వరకూ వచ్చేది కాదు.

ఒకరోజు ఇక ఆకలిని ఆపుకోలేక భార్యని టిఫిన్ అడిగాడు.

"వూరికే కూర్చున్న కొద్దీ మీకు మరీ ఆకలెక్కువయిపోతోందే!" అంది ఎగతాళిగా.

శివరావు సిగ్గుతో చచ్చిపోయినట్లయ్యాడు.

"ఆకలితో చావనన్నా చావాలిగానీ, టిఫిను అడగకూడదు !" అనుకున్నాడు.

ఆ రాత్రి పద్మ చంద్రంతో - "ఏవండీ ! రిటైరయ్యాక మీ నాన్నకి తిండియావ ఎక్కువయి పోయిందండీ ! ఇలా అయితే కొంప గుల్లయిపోవడం ఖాయం !" అంది వ్యంగ్యంగా.

ఆ మాటలు విన్నాక శివరావుకి మొదటిసారిగా అన్పించింది - రిటైరయ్యాక తనింకా ఎందుకు బ్రతికున్నాడో ? అని.

మనుషుల మధ్య ప్రేమానురాగాలు లేవు.

మమతానుబంధాలు లేవు.

డబ్బే ప్రధానం .....

కట్టుకున్న భార్యకైనా, పిల్లలకైనా డబ్బే ముఖ్యం ! డబ్బుతోనే అన్ని బంధాలు ముడేసుకుని వుంటాయి.

తను మళ్లీ వుద్యోగం చేసి డబ్బు సంపాదిస్తే తనని గౌరవిస్తారు.

ఈ అవమానాల్ని, అవహేనలల్ని తట్టుకోలేకుండా వున్నాడు.

వాళ్ళ ప్రేమాభిమానాల కోసం కాకపోయినా తన మనశ్శాంతి కోసమైనా మళ్లీ వుద్యోగం చేయాలి ! డబ్బు సంపాదించాలి !

శివరావు మనసులో గట్టిగా నిర్ణయం తీసుకున్నాడు.

మర్నాటినుంచీ లైబ్రరీ కెళ్లి వాంటెడ్ కాలమ్స్ చూస్తూ తనకు సరిపోయే ఉద్యోగాలు వుంటే అప్లై చేయసాగాడు.

* * *

ఆరు నెలలు గడిచాయి.

ఇంట్లో పరిస్థితి మరీ క్షీణించింది. పెన్షన్ వస్తోంది ! కానీ అంతా ఇంట్లో ఇచ్చేయాల్సి వస్తోంది.

కనీసం వక్కపొడి కొనుక్కోవాలన్నా చేతిలో పదిపైసలు కూడా లేకుండా పోతోంది.

ఒకసారి చంద్రాన్ని - 'రెండు రూపాయలివ్వరా !' అని అడగలేక అడిగాడు.

"మీకేం ఖర్చులుంటాయి నాన్నా ! ఇంట్లో డబ్బు చాలక అసలే ఇబ్బంది పడుతోంటే ! ఆ రెండ్రూపాయలుంటే రెండ్రోజులు కూరలొస్తాయి !" అనేశాడు.

ఆ తర్వాత చంద్రం భార్యతో అంటున్నాడు.

"పైసా సంపాదన లేదుగానీ ఖర్చులకేం లోటులేదు !"

ఆ మాట విన్నాక ఆ ఇంట్లోనుండి ఎక్కడికైనా వెళ్లిపోవాలన్పించింది.

రిటైరయ్యాక ఎంతో హాయిగా జీవించాలనుకున్నాడు.

కానీజీవితం ఇంత భయంకరంగా వుంటుందని వూహించలేకపోయాడు.

పోన్లే ! ఇదీ ఒకందుకు మంచికే వచ్చింది. తను రిటైరవబట్టే గదా తనవాళ్ల స్వభావం గ్రహించగలిగాడు ! లేకపోతే ఇంకావాళ్లంతా తనని ప్రేమిస్తున్నారనే భ్రమలోనే వుండేవాడు !

ఈ పిల్లలకోసం, భార్యకోసం తనెంత కష్టపడ్డాడు ?

మధ్యాహ్నం టిఫిను తింటే డబ్బు ఖర్చవుతుందని కాఫీతో సరిపెట్టుకునేవాడు. తోటి వుద్యోగస్తులు సినిమాకి వెడ్తూ తనని రమ్మన్నా వెళ్లేవాడుకాదు. ఆ డబ్బుల్తో పిల్లల్ని, భార్యని సినిమాకి పంపిస్తూ వుండేవాడు. తను వుద్యోగం చేస్తున్నా చిరిగిన బట్టల్తోనే ఆఫీసుకు వెళ్లేవాడు.

పండగొచ్చిందంటే పిల్లలకు అప్పు చేసైనా బట్టలు కొనేవాడు.

తను చిన్నప్పుడు అనేక కష్టాలు పడ్డాడు. పస్తులు కూడా వున్నాడు.

తన పిల్లలు అటువంటి బాధలు పడకూడదని ఆఫీసయాక కోమటి కొట్లో పద్దులు రాసేవాడు.

ఎన్నో వెన్నెల రాత్రులు, ఎన్నో చల్లని సాయంత్రాలు, ఎక్కవుంట్లు రాస్తూ పుస్తకాల మధ్య గడిపాడు.

ఈ కుటుంబం కోసం, తన ఒంట్లోని రక్తాన్ని చెమటగా మార్చాడు.

అంత చేసినందుకు తనకు ప్రతిఫలం .... ఆలోచిస్తున్న శివరావు గుండె పట్టినట్లయింది.

ఒకప్పుడు తను జీవితాన్ని ఎంతో ప్రేమించాడు. తనకు కొద్దిగా జ్వరం వచ్చినా భయపడేవాడు ! తనకేదైనా అయితే తనవాళ్లు ఏమయిపోతారు ? తను లేకపోతే ...... వాళ్లు క్షణంకూడా వుండగలరా ! అనుకునేవాడు.

కానీ ... ఇప్పుడు -

తను బ్రతికున్నా చచ్చినవాడికింద జమకట్టారు ..... అంతే ....

ఎక్కడో పక్షి ఎగిరిన చప్పుడు ........

దానివెంట వికృతంగా ఒక చిన్నకేక !

మళ్లీ ఎప్పటి ప్రశాంతత అల్లుముకుంది !

* * *

తెల్లవారింది !

యధాప్రకారం కార్యక్రమాలు జరిగిపోతున్నాయి.

ఉదయం తొమ్మిది గంటల సమయంలో రంగనాథం వచ్చాడు ! వస్తూనే -

"ఒరేయ్ చంద్రం ! ఇది విన్నావా ? మీ నాన్నకి రావ్ అండ్ రావ్ కంపెనీలో మేనేజర్ వుద్యోగం వచ్చింది. రాత్రి మా బావమరిది చెప్పాడు. నెలకు వెయ్యి రూపాయల జీతంట !" అన్నాడు వుత్సాహంగా.

ఆ మాట వినగానే ఇంట్లో కలకలం బయలు దేరింది. ఈ వార్త ఆ ఇంట్లోని వారందరికీ ఆశ్చర్యంతోపాటు, ఆనందం కూడా కలిగించింది.

"ఇంతకీ శివరావు ఏడీ?"

రంగనాథం ప్రశ్నతో, అప్పటికి శివరావు అజ వచ్చింది వాళ్ళకి.

"అవును ......... ఏడీ ............ ఇంకా లేవలేదా ? అయ్యో ! మనం ఇందాకట్నించీ గమనించలేదే ?" అనుకుంటూ అందరూ నొచ్చుకున్నారు.

చంద్రం తండ్రి గదిలోకి వెళ్ళాడు. మంచం మీద శివరావు గాఢనిద్రలో వున్నాడు.

"నాన్నా !" అని లేపబోయి, చంద్రం కెవ్వున అరిచాడు. అందరూ పరిగెట్టుకు వచ్చారు.

శివరావు ప్రాణాలు గాలిలో కలిసి ఎంతో సేపయింది. అందరూ ఘొల్లుమన్నారు.

శివరావు శవం మీదపడి ఏడుస్తున్న వాళ్లనే చూస్తున్నాడు. రంగనాథం.

ఆ ఏడుపులో శివరావు చనిపోయాడనేబాధ కంటె, నెలకు వెయ్యిరూపాయలు పోయాయనే దిగులే కన్పిస్తోంది రంగనాధానికి !